ప్రజాశక్తి
శనివారం 29 నవంబర్ 2025
5
కర్నూలు

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, భూనిర్వాసితులు

పత్తి కొనుగోళ్లకు ని'బంధ'నాలు

- తేమ శాతం పేరుతో సిసిఐ కొర్రీలు
- కొంటున్న దానికీ దక్కని మద్దతు ధర

కర్నూలు జిల్లా ఆదోనిలో ఎన్‌డిబిఎల్ వద్ద బారులు తీరిన పత్తి వాహనాలు

ఆరుగాలం కష్టించి పత్తిని పండించిన పత్తి రైతులకు పంట అమ్ముకోవడానికి కష్టాలు తప్పడం లేదు. కొనుగోళ్లకు సిసిఐ నిబంధనలతో రైతులు పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. తేమ శాతం పేరుతో సిసిఐ కొర్రీలు పెడుతోంది. దీంతో రైతులు పంటను వెనక్కి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఈ ఏడాది కర్నూలు జిల్లాలో 5.58 లక్షల ఎకరాల్లో, నంద్యాల జిల్లాలో 14 వేల ఎకరాల్లో పంట సాగైంది. మొంథా తుపాను వల్ల అక్టోబర్ నెలలో కురవాల్సిన సాధారణ వర్షం కంటే 84 శాతం అధిక వర్షం కురిసింది. దాంతో పూత, పిందె రాలిపోయి, కాయలోని పత్తి తడిసిపోయి, కాయలోనే గింజలు మొలకెత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 5 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. చేతికి వచ్చిన పత్తి నైనా అమ్ముకుందామని వస్తే సిసిఐ నిబంధనలతో మరింత నష్టాలపాలవుతున్నారు. రైతులు అధికారికంగా స్లాట్ తీసుకుని పత్తిని మిల్లుల వద్దకు తీసుకెళ్లినా నిరాశే ఎదుర వుతోంది. తేమ శాతం 12 శాతం కన్నా అధికంగా ఉందని, నాణ్యత లేదని, రంగు మారిందని, గింజ పరిమాణం సరిగా లేదని తదితర కారణాలు చూపుతూ సరకు కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 27 పత్తి మిల్లులు అందుబాటులో ఉండగా కేవలం 12, నంద్యాల జిల్లాలో రెండు మిల్లుల్లో మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మరో నాలుగు మిల్లుల్లో అధికారికంగా పత్తి కొనుగోళ్ల ప్రారంభం కావాల్సి ఉంది. మిగిలిన ఎన్ని మిల్లుల్లో ఎప్పటి నుంచి కొనుగోళ్ల ప్రారంభమవుతాయన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.

దక్కని మద్దతు ధర

గత నెల మొదటి వారం నుంచే పంట కోతలు కోయగా ఈ నెల 1 నుంచి సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యం కావడంతో చాలా మంది రైతులు ప్రయివేటు వ్యాపారులకు పత్తిని అమ్ముకున్నారు. ప్రయివేటు వ్యాపారస్తులు క్వింటా పత్తి రూ.5 వేల నుంచి రూ.7వేల లోపే కొనుగోలు చేశారు. పత్తికి ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోళ్లు చేస్తున్న దాంట్లో బన్ని, బ్రహ్మ, పింజ రకం పత్తి క్వింటాకు రూ. 8110 ఇస్తుంది. పత్తిలో తేమ శాతన్ని బట్టి సిసిఐ ద్వారా రైతుకు మద్దతు ధరను చెల్లిస్తారు. 8 శాతం వరకు తేమ ఉంటే రూ. 8,110, 9 శాతం తేమ ఉంటే రూ. 8,028.90, 10 శాతం తేమ ఉంటే రూ.7,947 నుండి 8,000, 11 శాతం ఉంటే 7866.70 వరకు, 12 శాతం తేమ ఉంటే 7785.60 రూపాయలు మద్దతు ధర కల్పిస్తారు. 12 శాతం పైగా తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.8110 మద్దతు ధర రైతులకు దక్కడం లేదు.

స్లాట్ బుకింగ్‌కూ తప్పని తిప్పలు

పత్తి రైతుకు స్లాట్ కష్టాలు తప్పడం లేదు. పత్తి కొనుగోళ్లకు సిసిఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా రైతు సేవా కేంద్రాల్లో రైతుల వివరాల నమోదుకు యాప్ ఓపెన్ కావడం లేదు. దీంతో రైతులు స్లాట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. స్లాట్ ఓపెన్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు పండించిన పంటల వివరాలు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో ఈ క్రాప్ చేయించుకోవాలి. గతవారం రోజులుగా రిజిస్ట్రేషన్ కావడం లేదు. అలాగే పత్తి రైతులు కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సాంకేతిక సమస్యల వల్ల రిజిస్ట్రేషన్ కావడం లేదని, స్లాట్ కూడా ఓపెన్ కావడం లేదని మార్కెటింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

సిసిఐ నిబంధనలను పూర్తిగా సడలించాలి

మొత్తం పత్తిని కొంటామని ప్రభుత్వం ప్రకటన చేస్తున్నా తేమ శాతం 12 కంటే ఎక్కువ ఉంటే కొనుగోలు చేయడం లేదు. తిరిగి వెనక్కి పంపిస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చెబుతున్న దానికి చాలా తేడా ఉంది. తుపాను, అధిక వర్షాల వల్ల తేమ శాతం ఖచ్చితంగా ఉంటుంది. అలాంటి సమయంలోనే అన్నదాతను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులకు అన్యాయం చేస్తోంది. సిసిఐ నిబంధనలను పూర్తిగా సడలించాలి. 20 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేయాలి. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట భూ నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు ఆర్‌టిఒ కార్యాలయం ఎదుట భూ నిర్వాసితుల కమిటీ ఆధ్వర్యంలో బాధిత రైతులతో ధర్నా చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న అధ్యక్షతన జరిగిన ధర్నాలో డి.గౌస్ దేశాయ్ మాట్లాడారు. ఎపిఐఐసిలో భూములు కోల్పోయి ఏండ్లు గడుస్తున్నా నష్టపరిహారం చెల్లించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఓర్వకల్లు మండలాన్ని పరిశ్రమల హబ్బుగా ఏర్పాటు చేసి 30 వేల ఎకరాలకు పైగా భూములు సేకరించారన్నారు. అందులో ఎపిఐఐసి పేరుతో పదివేల ఎకరాలకు పైగా భూములు అభివృద్ధి చేస్తున్నారన్నారు . మీది వేముల రైతుల భూములు ప్రభుత్వం తీసుకుందని అయితే అనేకమందికి ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఆ భూములకు గతంలో అనేకమందికి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేశారని, మరి కొంతమందికి పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వలేదన్నారు. పట్టాపాస్ పుస్తకాలు ఇచ్చిన వారికి కూడా కొంత భూమికి మాత్రమే నష్టపరిహారం చెల్లించారన్నారు. మిగతా భూములకు ఇవ్వలేదని, తక్షణమే కర్నూలు ఆర్‌డిఒ స్పందించి ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతుల భూములకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కర్నూలు ఆర్డిఓ కార్యాలయ ఎఒకు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్, హరి సర్వాల ఎల్లయ్య, కృష్ణవేణమ్మ, నాగమ్మ, ఎల్లయ్య, మద్దిలేటి, ఎర్రమల, వెంకటేశ్వర్లు, శేఖర్, గోపాల్, లక్ష్మన్న, సుబ్బమ్మ, శ్రీదేవి, పుణ్యవతి, శివమ్మ, ఎల్లమ్మ, సామేలు మహిళా రైతులు పాల్గొన్నారు.

సర్వేయర్లు డబ్బులు వసూలు చేస్తున్నారు

-జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల కాలంలో సర్వే చేసేందుకు కొంతమంది సర్వేయర్లు డబ్బులు వసూలు చేస్తున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ సిరి సర్వే శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖ ద్వారా అందుతున్న సేవలపై ప్రజాభిప్రాయ సేకరణలో ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపైజిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ అంశాలపై ఆర్‌డిఒలతో, మండల తహశీల్దార్, సర్వేయర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎక్కువగా రెవెన్యూ, సర్వేకు సంబంధించిన అర్జీలు వస్తున్నాయని, వాటిని డ్రైవ్ మోడ్‌లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏ సమయం దగ్గరికి వచ్చినపుడు హడావిడి గా పరిష్కరించడం ద్వారా రీ ఓపెన్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మీ సేవ, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన 22 ఎలో మార్పులకు సంబంధించి వచ్చిన అర్జీలను త్వరితగతిన వెరిఫై చేసి పంపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి

జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో హాస్టల్స్ నిర్వహణపై సంక్షేమ శాఖల అధికారులు, డిఇఒ, రెసిడెన్షియల్ స్కూళ్ల కో ఆర్డినేటర్లు, కెజిబివిల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్ల లో విద్యార్థులు వసతుల లేమితో ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. హాస్టళ్ల లోపల, బయట పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. టాయిలెట్లను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంట గదిలో పరిశుభ్రత పాటించాలన్నారు. హాస్టళ్లకు ఎఎన్ ఎంలు 15 రోజులకు ఒకసారి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించా లని, అలా జరగక పోతే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఒక్క విద్యార్థి అనారోగ్యంతో ఇబ్బంది పడకూడదన్నారు. విద్యార్థుల రక్షణ కూడా ముఖ్యమని, ఈ అంశంలో ఏమైనా జరిగితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. హాస్టళ్లలో స్టాక్ నిర్వహణ సరిగ్గా లేదని, సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, బిసి సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, డిఇఒ శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విభజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆదోని మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదోని మండలాన్ని ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విభజిస్తూ ప్రభుత్వం జిఒఆర్‌టి నం.1503 తేదీ 2025 నవంబర్ 27 ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గెజిట్ నం. 796 తో నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఆదోని హెడ్ క్వార్టర్‌గా ఆదోని మండలంలో 29 గ్రామాలు, పెద్దహరివాణం హెడ్ క్వార్టర్ గా పెద్దహరివాణం మండలంలో 17 రెవెన్యూ గ్రామాలను ప్రతిపాదిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆదోని మండలంలో ఆదోని, కల్లుబావి, వెంగళాపురం, పర్వతాపురం, మండిగిరి, ఎస్.కొండాపురం, ఇస్వీ, గోనబావి, దిబ్బనకల్లు, నెట్టేకల్లు, ఆరెకల్, బైచిగేరి, సలకలకొండ, విరుపాపురం, దొడ్డనకేరి, సాంబగల్లు, హువ్వనూరు, కపటి, బసరకోడు, చిన్న పెండేకల్లు, బల్లేకల్లు, మాంత్రికి, దెయ్యాలగూడెం, పాండవగల్లు, కుప్పగల్లు, జాలిమంచి, సుల్తానాపురం, పెసలబండ, పెద్దతుంబళం గ్రామాలు, పెద్దహరివాణం మండలంలో పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, యడవల్లి, బలదూరు, చిన్నగోనెహాలు, చిన్నహరివాణం, మదిరె, కడితోట, హానవాళు, జి.హొసల్లి, బసాపురం, వి.కొండాపురం, నాగనాథనహళ్లి, నారాయణపురం, చాగి, ధణాపురం, గణేకల్లు గ్రామాలతో మండలాల ఏర్పాటును ప్రతిపాదిస్తూ నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని 30 రోజుల లోపు కర్నూలులో ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పెద్దహరివాణం

వీరబ్రహ్మేంద్రస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించాలి

టిటిడి చైర్మన్‌ను కోరిన పార్వతమ్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిటిడి చైర్మన్‌కు ఆహ్వానం పలుకుతున్న పార్వతమ్మ

పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి, గోవింద మాంబ అమ్మవార్ల కళ్యాణోత్సవం, శ్రీ ఈశ్వరి మాత అమ్మవారి ఆరాధన ఉత్సవంలో పట్టు వస్త్రాలు సమర్పించాలని తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు బొల్లినేని రాజగోపాల్ నాయుడును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ , అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ , బ్రహ్మశ్రీ ధనాలకోట శోభన్ బాబు, బ్రహ్మశ్రీ డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ , మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘసంస్కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవింద మాంబ అమ్మవార్ల కళ్యాణోత్సవం, శ్రీ ఈశ్వరి మాత అమ్మవారి ఆరాధన ఉత్సవంలో పట్టు వస్త్రాలు అన్ని లాంఛనాలతో సమర్పించుటకు రావాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల మంది విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు వంశపారంపర్య శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దంపతుల కల్యాణ మహోత్సవం ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినాన బ్రహ్మంగారి మఠంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. వైశాఖ శుద్ధ దశమి రోజున శ్రీ స్వామి వారు సజీవ సమాధి చెంది నిష్టాగరిష్టులై వేంచేసి ఉన్న రోజు వారి ఆరాధన ఉత్సవం నిర్వహిస్తున్నారు. శ్రీ స్వామివారి మనుమరాలు శ్రీ మాత ఈశ్వరి మాత ఆరాధన ఉత్సవాలు ప్రతి సంవత్సరం మార్గశిర బహుళ నవమి రోజున నిర్వహిస్తారు. పై మూడు సందర్భాలలో టిటిడి దేవస్థానం నుండి సకల లాంఛనంతో పట్టు వస్త్రాలను సమర్పించాలని టిటిడి పాలకమండలి అధ్యక్షులు బిఆర్ నాయుడును కోరారు. వారి విన్నపాన్ని వినయ పూర్వకంగా విన్న అధ్యక్షులు బిఆర్ నాయుడు సానుకూలంగా స్పందించి తప్పనిసరిగా పాలకమండలిలో ఆమోదింపజేసి తెలియజేస్తానని తెలిపారు. అందుకు విశ్వబ్రాహ్మణుల అందరి తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

మాక్ అసెంబ్లీకి సి బెళగల్ విద్యార్థి

ప్రజాశక్తి-సి బెళగల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులచే చేపట్టిన మాక్ అసెంబ్లీలో పాల్గొనడం గర్వంగా ఉందని, సంతృప్తి నిచ్చిందని సి బెళగల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కె.లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 22 న మాక్ అసెంబ్లీ 175 మంది ప్రజా ప్రతినిధులుగా ఎంపిక ప్రక్రియలో భాగంగా కోడుమూరు తాలూకా నుండి సోమలగూడూరు కు చెందిన స్రవంతి, గిడ్డా రెడ్డిల కుమారుడు సి బెళగల్ హైస్కూల్ లో పదోతరగతి విద్యార్థి లోకేశ్వర్ రెడ్డి ఎంపికయ్యారు. 26 న అసెంబ్లీలో అడుగు పెట్టగానే కొత్త అనుభూతి కలిగిందన్నారు. అందులో స్పీకర్‌ను ప్రతి పాదించే బాధ్యత గల నేతగా చాటుకున్నానని వివరించారు. అలాగే భవిష్యత్తులో ప్రజా ప్రతినిధిగా రాణించి సేవా దృక్పథం ఏంటో నిరూపించుకోవాలన్న కాంక్ష తెప్పించిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం స్కూల్ కు హాజరు కాగా ప్రశంసలు వెల్లువేత్తాయని ఉపాధ్యాయుల, విద్యార్థుల నుండి అభినందనలు అందుకున్నట్లు తెలిపారు.

టెట్ పరీక్షపై రివ్యూ పిటిషన్ వేయాలి

-టీచర్లకు బోధ నేతర పనులను విరమించుకోవాలి
-యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టెట్ పరీక్ష పై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్‌లో దశలవారి పోరాటం చేపడుతుందన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతరపనులను అప్పగించ రాదని పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాధ్యక్షుడు కె సురేష్ కుమార్ పాల్గొన్నారు. నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష పాస్ కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ వేయడంలో అలసత్వం వహిస్తుందన్నారు. ఇప్పటికే యుటిఎఫ్ సహ ఇతర సంఘాలు పిటిషన్ దాఖలు చేశాయన్నారు. డిసెంబర్ నెలలో తాలూకా కేంద్రాల్లో,జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. వచ్చేయేడాది జనవరిలో చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు భోజన ఇతర పనులను అప్పగించడం లేదని చెబుతూనే మరోపక్క జిల్లాలో కలెక్టర్లు విద్యాశాఖ అధికారులు అప్పగిస్తున్నారన్నారు. కేవలం బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేయాలన్నారు. డిసెంబర్ 5న జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను అధికార పార్టీ ఉత్సవ కార్యక్రమంగా నిర్వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నేతల ప్రమేయం లేకుండా కేవలం ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన డిఎలను వెంటనే విడుదల చేయాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి, జిల్లా సహ అధ్యక్షులు జి.హేమంత్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కె.యెహెూషువ ఇతర జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, వేదికపై కె.సురేష్‌కుమార్

ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు కొత్త బస్టాండ్ దగ్గర గల ఎపి రజక వత్తిదారుల సంఘం జిల్లా కమిటీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబాపూలే 135వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎపి రజక వృత్తిదారుల సంఘం న్యూ సిటీ కార్యదర్శి సి శేషాద్రి అధ్యక్షతన జరిగిన సభ లో ముందుగా మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ మాట్లాడారు. మహాత్మ జ్యోతిబాపూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసాడన్నారు. 1873 సెప్టెంబరు 24న పూలే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్య శోధక్ స మాజ్‌ను ఏర్పాటు చేసి అణ గారిన వర్గాల అభ్యున్నతి కోసం పని చేసారన్నారు. సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరి పనిచేసేలా కషి చేశాడన్నారు. పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించాడని, వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడన్నారు. సంప్రదాయాల ముసుగులో విద్య, ఆస్తి, జ్ఞానం కొందరికే చెందే విధంగా ఉన్న వ్యవస్థకు పట్టిన పీడను చర్నాకోలతో వదిలించిన ఘనుడు జ్యోతిబాపూలే అన్నారు. పూలే ఆశయాల సాధనకు కృషి చేద్దామని కోరారు. కెవిపిఎస్ జిల్లా నాయకురాలు విజయమ్మ, రజక వృత్తిదారుల సంఘం ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పుష్ప, శేఖర్ బాబు, జిల్లా నాయకులు కృష్ణ, పరుశురాం, డప్పు సంఘం నాయకులు బతకన్న పాల్గొన్నారు.

మహాత్మాజ్యోతిబాపూలేకు నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కర్నూలు మార్కెట్ యార్డు వివరాలు తెలుసుకుంటున్న జెసి నూరుల్ ఖమర్

రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కర్నూలు మార్కెట్ యార్డును ఆకస్మిక తనిఖీ చేసిన జెసి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మార్కెట్ యార్డులో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మార్కెట్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ మార్కెట్ యార్డు ప్రాంగణం, డైనింగ్‌హాల్, వాష్‌రూమ్‌లు, మినరల్ వాటర్ ప్లాంట్లు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. మార్కెట్ యార్డును శుభ్రంగా నిర్వహించాలని, ప్రతిరోజూ చెత్తను తొలగించాలని, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ మార్కెట్ యార్డు కార్యదర్శి జయలక్ష్మిని ఆదేశించారు.

సమస్యలను వేగంగా పరిష్కరించాలి

-కబ్జాకు గురైన భూములు కాపాడండి
-మండల సమావేశానికి పలువురురు అధికారుల డుమ్మా

మాట్లాడుతున్న పెద్దహుల్తి సర్పంచి కె. విజయలక్ష్మి

ప్రజాశక్తి-పత్తికొండ : అధికారులు , ప్రజా ప్రతినిధులు కలిసి ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని పత్తికొండ ఎంపిపి నారాయణ దాసు కోరారు. శుక్రవారం పత్తికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నారాయణ దాసు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా పశుసంవర్ధక శాఖ, ప్రాథమిక ఆరోగ్య శాఖ, బిసి సంక్షేమ శాఖ అధికారులు డుమ్మా కొట్టారని అన్నారు. సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హోసూర్ ఎంపిటిసి నెట్టికల్లు సభ దృష్టికి తెచ్చారు. సూపరెండెంట్ డాక్టర్ కల్పన మాట్లాడుతూ పత్తికొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సిజరిన్ కేసులు జరుగుతున్నాయని చెప్పడంతో వెంటనే దేవనబండ సర్పంచి ప్రవీణరెడ్డి ఇంతవరకు ఆపరేషన్ జరుగుతున్నాయని మాకు తెలియదని సభలో వ్యాఖ్యానించారు. తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సక్రమంగా రేషన్ పంపిణీ చేశామన్నారు. పెద్దహుల్తి సర్పంచి కోలాంట్ల విజయలక్ష్మి మా గ్రామంలో ప్రభుత్వ భూమి కొందరు కబ్జా చేస్తున్నారని తెలిపారు. విఆర్ఒ కబ్జాదారుడు కుమ్మక్కై ప్లాట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని తహ శీల్దార్‌ను కోరారు. ఆయా శాఖల అధికారులు తూతూ మంత్రంగా తమ నివేదికచదివి మమఅనిపించారు. పత్తికొండ సొసైటీ చైర్మన్‌రంగప్ప, ఎంపిడిఒ కవిత, డిప్యూటీఎంపిడిఒ నరసింహులు, వైస్ ఎంపిపి బలరాముడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బీటీ.నాయుడును సన్మానిస్తున్న న్యాయవాదులు

రాజకీయ ఎదుగుదలకు

న్యాయవాద వృత్తి దోహదం : ఎమ్మెల్సీ బీటీ

ప్రజాశక్తి - ఆదోని

రాజకీయ ఎదుగుదల్లో చదువుతో పాటు న్యాయవాద వృత్తి ఎంతో దోహద పడిందని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు తెలిపారు. రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైనందుకు శుక్రవారం ఆదోని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బీటీ.నాయుడును సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, జీవన్ సింగ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ.నాయుడు మాట్లాడారు. న్యాయవాదిగా ప్రజల మధ్యలోకి వచ్చి అంచెలంచెలుగా ఎదిగి పట్టుదల, ధైర్యంతో రాజకీయాల వైపు వెళ్లి రెండుసార్లు ఎమ్మెల్సీగా ఎంపిక కావడం ప్రజల ఆశీస్సులతోనే సాధ్యమైందన్నారు. ఆదోని కోర్టు భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని, జూనియర్ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అంతకుముందు సుదీర్ఘ రాజకీయ విషయాలను న్యాయవాదులతో పంచుకున్నారు. ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆదోని న్యాయవాదుల సంఘం తరఫున ఎమ్మెల్సీ బీటీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ బీటీని న్యాయవాదులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఆదోని న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు వెంకటేష్, సీనియర్ న్యాయవాదులు విశ్వనాథ్ రెడ్డి, రామిరెడ్డి, దేశాయ్, వైఆర్.మల్లికార్జున, యుజె.శ్రీనివాసులు, నాగేంద్రయ్య, ఆనంద్, వీరేష్, అనిత బాయి, సునీత రెడ్డి, సవిత, తబరేజ్, జూనియర్ న్యాయవాదులు, నాయకులు నాగరాజ్ స్వామి, నకరప్ప, కుమారస్వామి, గోపి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో

ఎస్‌ఎఫ్‌ఐ అలుపెరుగని పోరాటం

- డివైఎఫ్ఐ మాజీ నాయకులు బాలకృష్ణ

ప్రజాశక్తి - ఆస్పరి

సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలుపులేని పోరాటాలు చేసి ఎన్నో సమస్యలను పరిష్కరించిందని ఎస్ఎఫ్ఐ మండల మాజీ కార్యదర్శి రవి, డివైఎఫ్ఐ మాజీ నాయకులు బాలకృష్ణ, రంగాస్వామి, రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం స్థానిక భగత్ సింగ్ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర మౌలిక వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వసతులు కల్పించి, నాణ్యమైన వంట చేయాలని ఏపిడబ్ల్యూయుఎస్ సూచించారు. లేకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమస్య పరిష్కారానికి విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా విష్ణు, కార్యదర్శిగా తరుణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైద్య సేవలు సక్రమంగా అందించాలి

- ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ చిరంజీవి

ప్రజాశక్తి- దేవనకొండ



వైద్యులకు సూచనలు చేస్తున్న పీడీ చిరంజీవి

ప్రజలకు ఆసుపత్రులలో ఉండి వైద్య సేవలు సక్రమంగా అందించాలని ఆలూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ చిరంజీవి ప్రాథమిక వైద్యాధికారులను సూచించారు. శుక్రవారం దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందించే వైద్య సేవలు, మందుల పంపిణీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత సరిగా లేదని, మందుల పంపిణీ రికార్డులు సరిగా లేవని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కూడా తనిఖీ చేశారు. తాగునీటి వసతి, మరుగుదొడ్ల పరిశుభ్రత, తరగతి గదులను పరిశీలించారు. ఎంపిడిఒ జ్యోతి, వైద్యాధికారి విజయ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 21వ వార్డులో హెచ్‌బిఎస్ కాలనీలో పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైసిపి 21వ వార్డు ఇన్‌ఛార్జీ సయ్యద్ చాంద్ హాజరై నివాళులర్పించారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

- ఎమ్మెల్యే బీవీ
- బీవీ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

క్రీడలతో స్నేహభావాన్ని పెంపొందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. ప్రతిపాది శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా నిర్వహించే మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి స్మారక అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులు ఎన్‌టిఆర్, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు ఎమ్మెల్యే డాక్టర్ బీవీని భారీ గజమాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ మాట్లాడారు. గత 9 ఏళ్ల నుంచి బీవీ.మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించాలంటే ఒక్క టిడిపితోనే సాధ్యమని చెప్పారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. ఎమ్మిగనూరు క్రీడాకారులతో పాటు అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో దాదాపు 130 జట్లు పాల్గొనడం సంతోషకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి క్రికెట్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లయ్య, టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్ల చంద్ర శేఖర్, విరుపాక్షి రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, నరసన్న గౌడ్, రంగస్వామి గౌడ్, సురేష్ చౌదరి, కలీముల్లా, రామకృష్ణ నాయుడు, బందే నవాజ్, భీమేష్ పాల్గొన్నారు.

బ్యాడింగ్ ఆడి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

కూటమితోనే రైతుల సంక్షేమం : ఎమ్మెల్యే బీవీ

కూటమి ప్రభుత్వంతోనే అన్నదాత సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతన్నా మీకోసం'లో భాగంగా మండలంలోని మాచుమానదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే బీవీ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పనితీరు పట్ల రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, సిసి రోడ్లను ప్రారంభించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, టిడిపి మండల కన్వీనర్ కెటి.వెంకటేష్ పాల్గొన్నారు.



రైతులకు లబ్ధిపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే బీవీ

నేడు మండల సర్వసభ్య సమావేశం

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి



స్థానిక మండల కార్యాలయంలో శనివారం ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కార్యాలయంలో మాట్లాడారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అధికారులందరూ వారి వారి శాఖలో జరిగిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న తిమ్మాపురం ప్రజలు

గ్రామాభివృద్ధికి పెద్దపీట

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛారీజ వైకుంఠం జ్యోతి తెలిపారు. తమ గ్రామంలో ఫిల్టర్ వాటర్ మిషన్ చాలా రోజుల నుంచి పని చేయడం లేదని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం ఏబీసీ కాలువ సంఘం అధ్యక్షులు నగరడోన కిష్టప్ప ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన గోపాల్, హరి, జై రాముడు, హరీష్‌లు వినతిపత్రం ద్వారా వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడతానని, తక్షణమే తిమ్మాపురం గ్రామంలో ఫిల్టర్ వాటర్ కేంద్రం పని చేసేలా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడ ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని పలువురు ప్రజాప్రతినిధులకు, నాయకులకు సూచించారు.

సచివాలయ అధికారులు గ్రామాల్లో ఏ సమస్య ఉన్నది తెలుసుకొని సమస్యను సంబంధిత ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించేలా కృషి చేయాలని సచివాలయ అధికారులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎంపిటిసి వీరేష్

వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎంపిటిసి వీరేష్

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతికి మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... దేవనకొండలో బీసీ బాలుర హాస్టల్, గురుకుల పాఠశాల, కొత్త అంగన్వాడీ కేంద్రాలను, రేషన్ షాపులు, నూతనంగా సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు కుక్కల తిమ్మయ్య, మురళీ, ఖలీల్, బసవరాజు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టండి

- దేవరబెట్ట గ్రామస్తులు

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి మండలం సజ్జలగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న మజరా గ్రామమైన దేవరబెట్టలో గత 30 సంవత్సరాలుగా రోడ్డు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గ్రామ సమీపంలో ఉన్న వంక పదేపదే కుంగిపోవడం గ్రామస్తులు కలిసి మట్టి వేసుకుని తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా దేవరబెట్ట రోడ్డు మాత్రం ఇంతవరకు వేయలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 300కు పైగా ఓటర్లు ఉన్నారని, 100 గడపలున్న ఊరికి రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అత్యవసర సమయాల్లో గ్రామానికి అంబులెన్సు కూడా రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం వంక పక్కన పెద్ద గుంతలు పడడంతో తాత్కాలికంగా మట్టి వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు, నాయకులు స్పందించి గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు.

తాత్కాలికంగా వేసిన మట్టిని చూపుతున్న గ్రామస్తులు

IN THE COURT OF THE IIND ADDL JR.CIVIL JUDGE : KURNOOL
O.S.NO.71/2024

Smt. R.Vimala. ....Plaintiff

Versus

P.Nagendram and anothers. ...Defendants

SUIT SOMMONS TO D1 ADN D2

1.P.Nagendram S/o P.Girijapathi, Hindu, aged about 84 years, business, R/o H.No.87/998, Rajeswari Nagar, Kurnool City.
2.K.G.Prasunamba W/o P.Nagendram, Hidnu, aged about 70 years, House-wife, R/o H.No.87/998, Rajeswari Nagar, Kurnool City.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదుల పైన ఈ క్రింద కనపరిచిన అంశములపైన షెడ్యూల్ ఆస్తి పైన దావ దాఖలు చేసినారు.

a) to direct the defendant to redeem the plaint schedule property by reconveying the plaint schedule property in favour of the plaintiff,
b) to award costs of the suit;
c) and to grant such other relief or relief which this Hon'ble Court may deem fit and proper, in the circumstances of the case.

ఇందులో 1,2 ప్రతివాదులు అయిన మీకు ఆక్షేపన ఉన్న 17.12.2025 తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు

As per plan the plots are made over the land bearing Sy.No.65/2A & 65/2C of Mamidalapadu Village, under the limits of Stantanpuram Panchayathi Area, Kurnool Mandal, Kurnool District within the Sub-Registration District of Kurnool and Registration District of Kurnool out of the said plots, Plot No.14 has been purchased by the plaintiff from one D. Srinivasulu through sale deed dated:26-08-2008 and the same has been registered in her favour at Book No.1, vide document No.7638 of 2008 at Kurnool Registrar Office, onwards the property is in her possession and enjoyment of the same and its constructed place measurements. The land admeasuring 25 feet or 7.62 Sq.meters towards East-West and admeasuring 75 feet or 22.86 Sq.meters towards North-South totally the land admeasuring 1875 Sq. Feet or 208.33 Sq. Yards of land is bounded as follows:

East :Land belongs to others.
West : Place of Plot No. 13
North : Part of land in the same survey number belongs to D. Srinivasulu
South : 30' feet width Road.

In between the land admeasuring 208.33 Sq. Yards of land issued vide by the Stantanpuram Gram Panchayath authority D.Dis. No. 101/5/2008-2009, dated:09-02-2009 and its to be constructed building as per plan and its 208.33 Sq. Yards of open place and its to be constructed 2nd floor (as per Physical Possession) at 1/3rd place i.e, 1500 Sq.feet of building is bounded as follows:

East :31½ feet width balcony.
West : Open place of the building
North : Open place of the building.
South : Open place of the building.

And its steps the place between the boundaries of 2nd floor only. The said entire property market value is **Rs. 10,50,000/- only.**

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
సయ్యద్ ఎం.డి మీర్‌షా ఖాద్రి,
ఎం.గోపాల్ శెట్టి ,
వాదిపురం అడ్వకేట్లు, కర్నూలు.

ఒక్క జిల్లా చేయలేరా..?

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

వైసిపి హయాంలో 13 జిల్లాలు ఏర్పాటయ్యాయని, ప్రజల డిమాండ్ మేరకు ఒక్క ఆదోనిని జిల్లాగా మార్చలేని నిస్సహాయ స్థితిలో కూటమి నాయకులు ఉన్నారని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి విమర్శించారు. పట్టణంలోని భీమాస్ కూడలిలో జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే దీక్షలకు శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, వైసిపి ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ రాజీవ్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. ఆదోనిని జిల్లాగా చేయాలని తమకు కూడా ఉండేదని, అప్పట్లో పరిస్థితులు అనుకూలించలేదని తెలిపారు. వైసిపి హయాంలో పార్లమెంట్ ప్రాతిపదికన 13 జిల్లాలు ఏర్పాటయ్యాయని, కూటమి ప్రభుత్వం కూడా మూడు జిల్లాలు రూపొందించిందని చెప్పారు. ఆదోనిని కూడా జిల్లా చేస్తే ఇక్కడి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన వారవుతారని తెలిపారు. ఆదోనికి జిల్లా అయ్యే అన్ని అర్హతలూ ఉన్నాయన్నారు. వట్టి మాటలు కట్టిపెట్టి జిల్లా సాధనకు మూడు పార్టీల నాయకులు కృషి చేయాలని తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి చమత్కారంగా మాటలు చెప్పడం మాత్రమే తప్ప ఆదోని ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంలో విఫలం చెందారని విమర్శించారు. మెడికల్ కాలేజీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేయించామని, నిర్మాణం పూర్తయిన మైనార్టీ ఐటిఐ కళాశాలకు ఫ్యాకల్టీని నియమించలేని దీనస్థితిలో ఉన్నారా అంటూ నిలదీశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ... ఆదోని జిల్లా ఉద్యమం రోజురోజుకు తీవ్రమవుతోందని, అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నా కూటమి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆదోని జిల్లా చేయకపోతే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

శిబిరానికి మద్దతు తెలుపుతున్న వైసిపి మాజీ ఎమ్మెల్యేలు

తక్షణమే ఆదోని జిల్లా చేయాలి

- ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం

వెనుకబడిన ఆదోని ప్రాంతాన్ని జిల్లా చేయాలంటూ ఆదోని డివిజన్ ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. స్థానిక భీమాస్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం శుక్రవారం 13వ రోజుకు చేరుకుంది. ఆదోని జిల్లా సాధన జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా ఆదోని ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు స్వచ్ఛందంగా నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, జెఎసి సభ్యులు విరుపాక్షి మాట్లాడారు. ఆదోని జిల్లా కావాలని ఎందరో దశాబ్దాలుగా పోరాటం చేస్తూనే ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారి పాలకులు మారినా ఆదోని జిల్లా డిమాండ్‌ను పెడచెవిన పెడుతూనే ఉన్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచేలా, జిల్లా సాధించుకునే వరకు పోరాటం ఆగదని తెలిపారు. దీక్షకు మద్దతుగా కార్మిక సంఘాలు, ఉద్యోగులు, వ్యాపారులు ఆదోని ప్రజలందరూ పాల్గొని దీక్షను ఉధృతం చేయాలని కోరారు. సాధన కమిటీ సభ్యులు నూర్ అహ్మద్, రఘురామయ్య, లలిత, కృష్ణమూర్తి గౌడ్, కుంకనూరు వీరేష్, కోదండ సాయిరాం ఉన్నారు.

దీక్షా శిబిరంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం దీక్షలు

బీసీ హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో బీసీ హాస్టల్‌ను జిల్లా వెల్ఫేర్ అధికారి కె.ప్రసూన శుక్రవారం తనిఖీ చేశారు. మరుగుదొడ్లలో విద్యుత్ సమస్య, ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు, పరిశుభ్రత తదితర వివరాలను ఇన్‌ఛార్జీ వార్డెన్ విశ్వనాథ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అన్నం రుచి చూసిన ఆమె సరిగా లేదని, నాణ్యత చూడాలని ఆదేశించారు. చికెన్‌లో నీరు ఎక్కువగా ఉందని, సరి చేసుకోవాలని సూచించారు. వంట రుచిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు బాలికల హాస్టల్ వార్డెన్ హారతి దేవి ఉన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

- ఎఒ జీరా గణేష్

ప్రజాశక్తి - మంత్రాలయం

వరి పంట సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు రైతులకు అవగాహన కల్పించినట్లు ఎఒ జీరా గణేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వగరూరు, తిమ్మాపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు చేస్తున్న రైతులు కొన్ని మెళకువలు పాటించాలని సూచించామని, వరి పంట తెగులు నివారణ, వరి పంట కోత ప్రయోగం ద్వారా రైతులకు చైతన్యం తెచ్చే ప్రయత్నం చేసినట్లు చెప్పారు. ఎఇఒ తిరుమల రెడ్డి, పర్యవేక్షణాధికారి రాధ, విఎఎ శేఖర్, ఎఫ్‌పిఒ గోపినాథ్, ఈరన్న పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

- ఎస్ఐ మారుతి

ప్రజాశక్తి - హాలహర్వి

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మారుతి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చత్రగుడి చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రహదారి నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం నేరమని తెలిపారు. రహదారి భద్రత నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని, అతిక్రమించిన వారిపై అపరాధ రుసుం, చలానాలు విధిస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహన దారులు ఏకాగ్రతతో వాహనాలను నడపాలని కోరారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు రహదారి నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. అజ్మతుల్లా, కానిస్టేబుల్ గోవర్ధన్ పాల్గొన్నారు.

మారని ఆర్‌ఎస్‌కె పేరు

- ఆర్‌బికెగానే కొనసాగింపు...

ప్రజాశక్తి -దేవనకొండ

దేవనకొండలో మారని ఆర్‌ఎస్‌కె పేరు

రైతులకు సేవలు అందిస్తున్న గత ప్రభుత్వంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా రైతు భరోసా కేంద్రాల పేరు మాత్రం రైతు సేవా కేంద్రంగా మారడం లేదని స్థానిక రైతులు చర్చించుకుంటున్నారు. ఈ పేరును మార్చాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతు సేవా కేంద్రంగా మార్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పెద్దతుంబలాన్ని మండలంగా ప్రకటించాలి

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - ఆదోని

క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించిన గ్రామస్తులు

మేజర్ గ్రామమైన పెద్దతుంబలాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే పార్థసారథి క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించారు. పెద్దతుంబలం గ్రామాన్ని మండలంగా ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని మండల సాధన కమిటీ సభ్యులు తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... ఆదోనిని నాలుగు మండలాలుగా ప్రకటించాలని అసెంబ్లీలో లేవనెత్తామని గుర్తు చేశారు. ఆదోని జిల్లా గురించి కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తూ ఓటు కోసమే రాజకీయం చేస్తున్నారని, మంచి పద్ధతి కాదని తెలిపారు. పెద్దహరివాణం మండలంగా ప్రకటించినప్పటికీ పెద్దతుంబలంను కూడా మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. అంతకుముందు పెద్దతుంబలం గ్రామస్తుల నినాదాలతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ ఉన్నారు.

జడ్‌పి పాఠశాలలో సంబరాలు

- బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు, కొత్త ఉపాధ్యాయులకు ఘన స్వాగతం



సంబరాల్లో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - హోళగుంద

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంబరాలు అంబరాన్నంటాయి. గత 2023-2025 వరకు పాఠశాలలో పనిచేస్తూ విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కబీర్ సాబ్ ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. 2025 డీఎస్సీలో ఎంపికై జిల్లా ఉన్నత పాఠశాలలో పని చేయడానికి వచ్చిన గురువులకు ఘన స్వాగతం పలికారు. గత అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కబీర్ సాబ్ మాట్లాడారు. బదిలీలు అనేవి అందరికీ సర్వసాధారణమని తెలిపారు. బదిలీపై దేవనకొండ జడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లిన నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులతో పాటు ఎస్ఎంసి ఛైర్మన్ ద్వారకనాథ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చేపలు విడుదల

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో నీరు నిల్వ ఉన్న చౌడమ్మ కుంటలో, దిగుడు బావిలో, గిడ్డన్న బావిలో, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు వైద్య, ఆరోగ్య సిబ్బంది గంభూషియా చేపలను శుక్రవారం వదిలారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అరుణ జ్యోతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణుడు మాట్లాడారు. గంభూషియా చేపలు దోమల లార్వాలను ఎప్పటికప్పుడు తినడం వల్ల దోమలు వృద్ధి చెందవని తెలిపారు. తద్వారా దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులు తగ్గుతాయని చెప్పారు. ఎంపిహెచ్ఇఒ రంగస్వామి, సూపర్‌వైజర్ మద్దిలేటి, ఆరోగ్య కార్యకర్త సర్వేశ్వర్ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ మరిచిన అధికారులు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

- వైసిపి ఆర్‌టిఐ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కొట్టాల రాజు

ప్రజాశక్తి - ఆలూరు

అధికారులు ప్రొటోకాల్ మరిచారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వైసిపి ఆర్‌టిఐ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు రాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో గోకులం షెడ్ నిర్మాణాలకు అధికారులు ప్రొటోకాల్ లేకున్నా టిడిపి నాయకులతో పూజలు చేయించారని, ఫ్లెక్సీలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఫొటో వేయకుండా అవమానించారని తెలిపారు. మండల అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ చట్టం ద్వారా పల్లె పండగ నిధులు కేటాయించి నిర్మిస్తున్న గోకులం షెడ్‌కు సంబంధించిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి, జిల్లాలోని మంత్రులు, ఎంపీతో పాటు ప్రొటోకాల్ లేని వారి ఫొటోలు వేయడం అధికారులకు సమంజసం కాదన్నారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిని విస్మరించడం సరి కాదన్నారు.

BEFORE THE A.P. STATE WAKF TRIBUNAL AT KURNOOL.
O.S. No. 42/2024

Between :
The Managing Committee,
Dargah Hazarath Dhoolsha Pahelwan & Masjid, Adoni,
Rep. by its President S. Alla Bakash, for and on behalf of A.P. State Wakf Board,
Vijayawada. .... Plaintiff

V/s.

1. Nirmala Devi,
2. The A.P. State Wakf Board,
Rep. by its Chief Executive Officer,
.... Defendants

To
Nirmala Devi, **(D-1)**
W/o Premnath, R/o D.No. 23/220,
Karvanpet, **ADONI**-518301.
Kurnool Dist. - A.P.

Whereas the above named Plaintiff filed the above suit against you for removing the illegal construction and for eviction of Defendant No. 1 from the Plaint Schedule property and also for grant of Mandatory Injunction in favour of the Plaintiff.

You are hereby directed to appear before this Hon'ble Court either directly or through Counsel on 19-12-2025, at 10.30 A.M. Failing which, the matter will be decided in your absence.

By Order of the Court.
M. SHAFIULLAH ANSARI,
ADVOCATE FOR THE PLAINTIFF,
KURNOOL.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE KURNOOL
A.S NO.17/2021

S.Mohammed Husain. ...Appilent

-VS-

1) Pedda Venkateswarlu
2) Chinna venkateswarlu (died) his LRS Renukabai and others. ...Respondents

NOTICE TO R3 TO R6

R3: Renukabai w/o Chinna venkateswarlu
R4: Hemalatha
R5: Sumalatha
R6: Pawan Kumar

All are children's of late Chinna venkateswarlu R/o Panchalingala village, Kurnool Mandal and district.

పై నెంబరు అప్పీలలో అప్పిలెంట్ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కర్నూలు ఓ.ఎస్. నెంబర్ 409/2013, 10.07.2019 తేదీ తీర్మానము మేరకు పై నెంబరు అప్పీలు దాఖలు చేసినారు. ఈ అప్పీలులో 3 నుండి 6 రెస్పాండెంట్లు అయినా మిమ్ములను ఐ.ఎ.52/2024, 10.09.2025 తేదీన అర్జీ ప్రకారము రెస్పాండెంట్లుగా చేర్చినారు. ఇందులో 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న 18.12.2005 తేదీన పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
ఐ.జోసఫ్,
కె.కృష్ణమోహన్ రెడ్డి,
అప్పిలెంటుపరం అడ్వకేట్లు, కర్నూలు.
ఫోన్ నెంబర్ : 9440553789

IN THE COURT OF THE II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) :: ADONI.
I.A. No. 666/2023 in O.S. No. 174/2020.

Between:
M. Danial ... Petitioner / Plaintiff.
AND
T. Venkatesh Naidu & another.
... Respondents/Defendants.

NOTICE TO RESPONDENT No. 1

To
T. Venkatesh Naidu,
S/o Talari Thimmaiah, H.No. 21/282,
Mandigiri, ADONI. 518 301.
Kurnool Dist.-A.P.

Whereas the above named Petitioner filed the above petition for granting permission to the Petitioner for amending the Plaint as shown in the Consequential Amemdment Memo " for cancellation of Regd. Sale Deed bearing Regn. No. 5094/2006, Dt. 17-11-2006, executed by the 1 (st) Respondent/ Defendant in favour of the 2(nd) Respondent / Defendant in respect of the Plaint Schedule property.

You are hereby directed to appear before this Hon'ble Court either directly or through Counsel on 09-12-2025, at 10.30 A.M. Failing which, the matter will be decided in your absence.

By Order of the Court.
J. VENKATESULU,
ADVOCATE FOR THE PETITIONER,
ADONI.
Place: ADONI
Date: 27-11-2025

స్వయం ఉపాధితోనే మహిళా సాధికారిత

- ఏకల్ గ్రామోథన్ ఫౌండేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పాండురంగారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్వయం ఉపాధితోనే మహిళా సాధికారిత సాధ్యమని భావించి ఏకల్ గ్రామోథన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా ఉపాది కల్పనకు కృషి చేస్తున్నామని ఆ ఫౌండేషన్ ఎపి, తెలంగాణ రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ పాండురంగా రెడ్డి తెలిపారు. శుక్రవారం రామచంద్ర నగర్ కాలనీలోని శ్రీవెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు వెళ్లే దారిలో ఉచిత కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజల్లో ఉన్న చదువుకున్న, చదువుకోలేని మహిళలకు శిక్షణ కేంద్రం ద్వారా 3 నెలల పాటు ఉచితంగా కుట్లు, ఫ్యాబ్రిక్ వివరాలు, కుట్లు నమూనాలు, చేతి కుట్ల వివరాలు, ఫ్యాషన్ లేఅవుట్ల గురించి నిర్వాహకురాలు లక్ష్మి (స్వప్న), రఘురాం నేర్పుతారని తెలిపారు. అనంతరం శిక్షణకు సర్టిఫికెట్ కూడా ఇస్తామని చెప్పారు. కేవలం మహిళలకే కాకుండా చదువుకున్న యువతకు కూడా కంప్యూటర్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఆ సర్టిఫికెట్ ద్వారా ముద్ర లోన్ ద్వారా బ్యాంకులో రుణాలు పొంది ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.మారుతి మోహన్ మాట్లాడుతూ... శ్రీవెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం పాఠశాల నిర్వాహకులు కవిత (సుగుణ) సహకారం వల్ల ఇక్కడ కుట్టుమిషన్ కేంద్రం వచ్చిందని తెలిపారు. ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ చైతన్య, తహశీల్దార్ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి, విఆర్ఒ భీమనగౌడు, పరిమళ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఫ్యాషన్ డిజైన్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు సాధన, నిర్వాహకులు లక్ష్మి, ఆమె భర్త రఘురామ్, కూతుళ్ల చందన, నయన, మహిళలు ఉమా, అనిత, మానస పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి

-చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కోసం పోరాటం
-వై నాగేశ్వరరావు యాదవ్ డిసిఎంఎస్ చైర్మన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మహాత్మా జ్యోతిబాపూలే ఆశయాలను సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని కెడిసిఎంఎస్ జిల్లా చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు యాదవ్ సూచించారు. శుక్రవారం కర్నూలు బిర్లా గేట్‌లో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. బీసీ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సత్రం రామకృష్ణ, బిసి శేషగిరి, సుజాత, రామకృష్ణుడు, జివి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. వై నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బిసిలు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరంగా మిగతా వర్గాల వారితో తీసిపోకుండా జీవించాలనేదే జ్యోతిరావు పూలే ఆశయం అన్నారు. చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మహిళా బిల్లు, బిసి మహిళలకు సబ్ కోటా ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ విషయాలపై జాతీయ బిసి సంక్షేమ సంఘం గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పోరాటాలు చేస్తున్నామన్నారు. ఆ పోరాటాలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం బిసిలను విస్మరించ కూడదని డిమాండ్ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 24శాతం

మాట్లాడుతున్న కెడిసి ఎంఎస్ జిల్లా చైర్మన్ నాగేశ్వర్‌రావు యాదవ్

మాత్రమే బిసి లకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 34 శాతంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మాట ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఆ మాటకు కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుని విన్నవించుకుంటు న్నారన్నారు. లోకేష్‌బాబు పాదయాత్రలో బిసిలకు రక్షణ చట్టం తీసుకువస్తానని తెలిపారు. బిసిలకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు.

తడి,పొడి చెత్త వేర్వేరు చేసివ్వండి

-కమిషనర్ విశ్వనాథ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజలు తమ గృహాలు, వ్యాపార వాణిజ్య సముదాయాల్లో వెలువడే వ్యర్థాల్లో తడి,పొడి చెత్తా వేర్వేరు చేసి, నగరపాలక సిబ్బందికి ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం గార్గేయపురం డంప్‌యార్డును ఆయన సందర్శించారు. యంత్రాలు, వర్మికంపోస్టు పిట్స్, కంపోస్టు తయారీ యూనిట్, కుక్కల సంతాన నియంత్రణ కేంద్రం, చెత్త వర్గీకరణ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. నెహ్రూ రోడ్డున బిటి రహదారి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు.ప్రతిరోజు తడి పొడి చెత్తను వేరు చేసి డంపు యార్డులో చెత్తను తగ్గించాలని సూచించారు. శునకాలకు ఆహారం, శుభ్రత, వాతావరణం తగ్గట్టు పరిసరాలు వంటి చర్యల్లో నిర్లక్ష్యం చేయొద్దని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.కమిషనర్ మాట్లాడుతూ.. డంప్ యార్డుకు చేరుతున్న చెత్తలో పెద్ద మొత్తంలో మిశ్రమ వ్యర్థాలు ఉండడం కారణంగా రీసైక్లింగ్ వ్యవస్థపై భారం పెరుగుతోందని పేర్కొన్నారు. తడి చెత్త వ్యర్థాలతో కూడిన పదార్థాలుగా గుర్తించి రోజూ వేరు చేయాలని, పొడి చెత్తను ప్లాస్టిక్, పేపర్, గ్లాస్ వంటి రీసైక్లింగ్‌కు అనువైన వస్తువులుగా విడిగా ఇవ్వాలని సూచించారు. డంప్ యార్డు వద్ద పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు, ఇతర వస్తువులను డిఆర్‌సికి తరలించాలన్నారు. తడి చెత్తను గార్గేయపురం డంప్ యార్డులో ఉన్న వర్మికంపోస్టు పిట్స్ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను కార్మికులు తప్పకుండా సేకరించి వంద శాతం సెగ్రిగేషన్ చేయాలని ఆదేశించారు. మిశ్రమ చెత్త చేరితే యంత్రాలు పనిచేయడంలో ఇబ్బందులు రావడంతోపాటు పరిశుభ్రత వ్యవస్థ మొత్తం ప్రభావితం అవుతుందని చెప్పారు.

గృహాల దగ్గరే చెత్త వేరు చేయడం ద్వారా డంప్ యార్డులపై ఒత్తిడి తగ్గి, రీసైక్లింగ్ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందన్నారు. పరిశుభ్రమైన కర్నూలు నిర్మాణంలో ప్రతి పౌరుడూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తడి చెత్తా 8 టన్నులు వస్తుందని, మిశ్రమ చెత్తా 250 టన్నుల వరకు ఉత్పత్తి అవుతుందని వెల్లడించారు. గత నెల 20 నుండి ప్రారంభమైన మూడో విడత శునకాల సంతాన నిరోధక చికిత్సలు ఇప్పటికీ 550 అయ్యాయని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రమాదకరమైన వీధి శునకాలను గార్గేయపురం డంప్‌యార్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ఇంచార్జి ఎస్ఇ శేషసాయి, ఎంఇ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్‌అండ్‌బి డిఇఇ ఫినిరాం, డిఇఇ కృష్ణలత, వెటర్నరీ డాక్టర్ మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్ తో మహిళలకు భద్రత

డిఎస్‌పి జె.బాబు ప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలు, డ్రగ్స్, సోషల్ మీడియా పై ప్రభావం , విద్యార్థులలో సామాజిక భాద్యత , మహిళల భద్రతకు శక్తి యాప్ , వాట్సప్ సేవల పై పాఠశాలలు, కళాశాలల్లో వాటి సేవలను కర్నూలు పోలీసులు విద్యార్థి, విద్యార్థినీలకు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం కర్నూలు డిఎస్‌పి జె. బాబు ప్రసాద్, కర్నూలు టు టౌన్ సిఐ నాగరాజారావు, కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, ఎస్ఐ తిమ్మయ్యలు కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, సోషల్ మీడియాపై ప్రభావం, విద్యార్థులలో సామాజిక భాద్యత, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలలో కూడా శక్తి టీం బృందాలు పలు పాఠశాలల్లో విద్యార్థులకు డయల్ 112 , 100 , 1098 ,1930 , శక్తి యాప్, మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి " వాట్సప్ 7993485111 నెంబర్ ను మహిళలు, చిన్నారుల భద్రత కోసం సేవ్ చేసుకోవాలని తెలియజేస్తున్నారు. ఎక్కడైనా గంజాయి , డ్రగ్స్, మాదకద్రవ్యాల

మాట్లాడుతున్న డిఎస్‌పి బాబు ప్రసాద్

సేవించడం చూసినా విక్రయాలు, వినియోగం గురించి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలని సూచిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ మధ్య తేడా, స్వీయ రక్షణ పద్ధతులు, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు , మహిళలపై జరిగే నేరాల పై అవగాహన కల్పిస్తున్నారు. 2025 జనవరి నుండి ఈనెల 28 వరకు శక్తి యాప్‌ను జిల్లాలో 19,846 మంది డౌన్లోడ్ చేసుకున్నారు.

వెల్దుర్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్

ప్రజాశక్తి - వెల్దుర్తి

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వెల్దుర్తి మండల కమిటీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్ మాట్లాడుతూ వెల్దుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వెల్దుర్తి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలంటే కర్నూలు ,

డోన్‌కి వెళ్లి చదువుకుంటున్నారు. విద్యార్థుల దూర ప్రయాణం చేసి చదువుకోవడం వల్ల ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులు నష్టపోతారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెల్దుర్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మందిపై చదువులు చదువుకోవడానికి అవకాశాలు కల్పించిన వారు అవుతారని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. విద్యార్థులు గ్రామాల నుంచి వచ్చి చదువుకోవడానికి విద్యార్థి బస్సులు సరైన సమయానికి నడపాలన్నారు. వెల్దుర్తి మండలంలో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. సిఐ టియు మండల నాయకులు రాజు, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ధోని, కేశవ, ప్రవీణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిని పూర్తిగా కొనుగోలు చేయాలి

-సిసిఐ నిబంధనలు సడలించాలి -కపాస్ కిసాన్ ను రద్దు చేయాలి
-ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సిసిఐ నిబంధనలు సడలించి తేమశాతంతో నిమిత్తం లేకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని రైతులకు ఇబ్బందిగా ఉన్న కపాస్ కిసాన్‌ను రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ జిల్లా నాయకులు మార్కండేయులు డివైఎఫ్ఐ నాయకులు అనిల్ సిపిఐ కోడుమూరు మండల కార్యదర్శి రాజు తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధిబృందం గూడూరు మండలం పెంచికలపాడు దగ్గర ఉన్న సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలన చేసింది. నాయకులు మాట్లాడుతూ ఈ సంవత్సరం కర్నూలు జిల్లాలో మొత్తం సాగు భూమిలో సగం పత్తి పంట వేశారన్నారు. మంచి దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు తుఫాను అధిక వర్షాల వల్ల పంట దిగుబడి నాణ్యత దెబ్బతిన్నదని అన్నారు. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాల్సింది పోయి రకరకాల నిబంధనలు పెట్టి ఇబ్బందులకు గురిచేసి కొనుగోలు చేయకుండా వెనక్కు పంపుతున్నారని తెలిపారు. ఆదోని, ఎమ్మిగనూరు ,మంత్రాలయం, పెంచికలపాడు దగ్గర సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.8110 మద్దతు ధర ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అత్యధిక మంది రైతులకు మద్దతు ధర అందడం లేదని అన్నారు. తేమశాతం పేరుతో నాణ్యత లేదు అనే పేరుతో రకరకాల పేర్లతోనే రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలు సరిపడా లేకపోవడం కాపాస్ కిసాన్ యాప్ స్లాట్ సరిగా పనిచేయకపోవడం చేత రైతులు రెండు మూడు రోజులు పాటు సిసిఐ కొనుగోలు కేంద్రం దగ్గరనే పడిగాపులు కాయాల్సిన వస్తుందన్నారు. నాణ్యత కలిగిన పత్తి కూడా కొనుగోలు చేయకుండా రిజెక్ట్ చేయడం దళారుల చేతుల్లో పెట్టడం ఫలితంగా సరైన ధర రాక రైతులు నష్టపోతున్నారన్నారు. అధికారులు, మంత్రులు చెప్పే మాటలకు చేతలకు పొంతన లేదన్నారు. ఇప్పటికైనా పత్తి రైతులను ఆదుకునేందుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకొని పత్తి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. డిసెంబర్ 1న పత్తి రైతుల సమస్య ఉల్లి రైతులకు రావలసిన డబ్బులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. పెద్ద కొట్టాల రామకృష్ణారెడ్డి, శీను, మహేశ్వర్ రెడ్డి పర్ల, కోడుమూరు, సుంకేసుల, బూడిదపాడు మునగాలపాడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పనులకు పరిశీలిస్తున్న ఆర్‌అండ్ బిడిఇ రమణ, ఎఇ

రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ కేంద్రంలో కిలోమీటర్ మేర పొడవునా నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఆర్ అండ్ బి డిఇ రమణ, ఎఇ ఫిభాలు గుత్తేదార్లను హెచ్చరించారు. శుక్రవారం సి బెళగల్ కేంద్రంలో రోడ్డు, సిసి పనులను తనిఖీ చేశారు. ఇక్కడే సిమెంట్, కంకర, ఇసుక నాణ్యతను కొలతలను పరిశీలించి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పనులను వేగవంతం చేయాలని వాహనాలు రద్దీ కీ ఇబ్బంది లేకుండా పనులను సకాలంలో పూర్తి చేయాలనీ కోరారు.

ఎపిఎస్‌పిడిసిఎల్ కంపెనీ ప్రెసిడెంట్ గా పెద్దయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం కంపెనీ ప్రెసిడెంట్ గా నంద్యాల జిల్లా మీటర్స్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న పెద్దయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి కిరణ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్ పెద్దయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం పెట్టుకొని ఇచ్చిన అవకాశాన్ని బట్టి రాష్ట్ర నాయకత్వం నాయకులు శివకుమార్, ఎవి కిరణ్ లకు కర్నూలు జిల్లా నాయకులు సుబ్బన్న, శ్రీనివాసులు, నాగశేషులకు ధన్యవాదాలు తెలిపారు. రిజర్వేషన్లలో గ్రూప్ వైస్ గా అమలు అయ్యేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు.